క్లుప్తంగా

జీఈఆర్ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

సి.బెళగల్: మండలంలోని గ్రామాలలో జరుగుతున్న బడిఈడు పిల్లలు, విద్యార్థులపై నిర్వహిస్తున్న జీఈఆర్ (గ్రాస్ ఎన్రోల్ రిజిష్టర్) సర్వేను పకడ్బందీగా చేట్టాలని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయాల సంక్షేమ సహాయకులతో జీఈఆర్‌పై సమావేశం నిర్వహించారు. ఈఓఆర్డీ మాట్లాడుతూ బడిఈడు పిల్లల సర్వేను వందశాతం పూర్తి చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మండల పరిషత్ కార్యాలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు, ఎంఐఎస్ రాజారావు, సీఆర్‌పీలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కేసీ కాల్వకు నీటి విడుదల నిలిపి వేత

గూడూరు: సుంకేసుల జలాశయం నుంచి కేసీ కాల్వకు నీటి విడుదల నిలిపేసినట్లు శనివారం డ్యామ్ అధికారులు తెలిపారు. జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచి పోయిందని, ప్రస్తుతం 0.608 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

వైభవంగా నాగమ్మ ప్రభోత్సవం



ప్రభోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గూడూరు: పట్టణంలో కొత్తబస్టాండ్ సమీపంలో వెలసిన సంతాన నాగమ్మ ప్రభోత్సవం శనివారం వైభవంగా జరిగింది. అమ్మవారికి ప్రతి ఏటా శ్రావణ మాసంలో మూడో శనివారం ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అమ్మ వారి ఉత్సవ విగ్రహాన్ని ప్రభపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం తిమ్మన్న

సి.బెళగల్: విద్యార్థులు తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రత పాటించాలని పోలకల్ స్పెషల్ స్కూల్ హెచ్‌ఎం తిమ్మన్న సూచించారు. శనివారం స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చేతుల పరిశుభ్రత, ఆరోగ్య అంశాలపై ఉపాధ్యాయులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ వ్యక్తిగత పరిసరాల శుభ్రత పాటిస్తే ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని సూచించారు.

క్రీడా స్ఫూర్తి ప్రదర్శించండి



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడా జట్టు

ఓర్వకల్లు: ప్రతి విద్యార్థి తాను ఎంచుకున్న క్రీడల్లో క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని షూటింగ్ బాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ కుమార్ అన్నారు. మండలంలోని కాల్వబుగ్గ సమీపంలో గల కాకతీయ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నెల్లూరు జిల్లా కావలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దేవికా, హెచ్‌ఎం మనోహర్‌నాయుడు, ఉపాధ్యాయులు తేజ, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాణ్యంలో మోస్తరు వర్షం



పాణ్యంలో కురుస్తున్న వర్షం

పాణ్యం: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. పది రోజుల నుంచి తీవ్ర ఎండలతో ప్రజలు అల్లాడుతున్నారు. అలాగే రైతులు వర్షం కోసం ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో శనివారం వర్షం రావడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు.

కొనసాగిన పింఛన్ల పంపిణీ



జె.సామేల్ వేలిముద్రలు తీసుకుంటున్న వలంటీర్ మహేశ్వరి

కల్లూరు: మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. రెండో రోజు శనివారం సల్కాపురం గ్రామానికి చెందిన వృద్ధుడు జె.సామేల్ కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ మహేశ్వరి కర్నూలుకు వెళ్లి వేలి ముద్రలు తీసుకుని పింఛన్ అందించారు.



ఓర్వకల్లులో వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



పాణ్యంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి



స్టాంటన్‌పురంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, నాయకులు



సి.బెళగల్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ బొంతల మునెప్ప, నాయకులు

చిరస్మరణీయుడు వైఎస్ఆర్

- మహానేత వర్ధంతి కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు
- వైఎస్ఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళ్లు

కల్లూరు: ప్రజారంజక పాలన అందించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిరస్మరణీయులని జిల్లా ప్రజాప్రతినిధులు కొనియాడారు. శనివారం వైఎస్ఆర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహానేత సేవలను స్మరించుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా దివంగత వైఎస్ఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆదర్శంగా నిలిచారని వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య అన్నారు. కల్లూరు అర్బన్ శరీన్‌నగర్, మేయర్ బీవై రామయ్య క్యాంపు కార్యాలయంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే కాటసాని శరీన్‌నగర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మేయర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు కొత్తగా పింఛన్ మంజూరైన లబ్ధిదారులకు పింఛన్ కానుక అందజేసి మాట్లాడారు. సంక్షేమ పథకాల ప్రదాత వైఎస్ఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, శ్వేతారెడ్డి, అరుణ, చిట్టెమ్మ, శ్రీనివాసులు, లక్ష్మీకాంతరెడ్డి, లక్ష్మీరెడ్డి, నారాయణరెడ్డి, కల్లూరు జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతురెడ్డి, హేమలత, సుంకన్న, ఆయా వార్డులోని స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మేయర్ క్యాంప్ కార్యాలయంలో నూతన పింఛన్లు అందుకున్న లబ్ధిదారులతో పార్టీ కర్నూలు, నంద్యాల జిల్లా అధ్యక్షులు బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: రైతు బాంధవుడు దివంగత వైఎస్ఆర్ అని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి అన్నారు. పాణ్యంలో మహానేత విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కో -ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్, ఎల్లగౌడ్, లక్ష్మీనారాయణ, స్వామి, సురేష్, రవి తదితరుల పాల్గొన్నారు.

వైఎస్ఆర్ అడుగుజాడల్లో నడుద్దాం

కర్నూలు (న్యూటౌన్): పేదల ఆశాజ్యోతి అయిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అడుగుజాడల్లో నడుద్దామని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం స్టాంటన్ పురంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జోహార్ వైఎస్సార్.. వైఎస్సార్ అమర్ రహే అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో డీవీఎంసీ రవిశాస్త్రి, వైఎస్ ఎంపీపీ2 నెహేమ్యా, జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, గిరిజోన్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షులు వాసు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మహబూబ్‌బాషా, సర్పంచ్ విద్యాసాగర్, వైస్ సర్పంచ్ మల్లశివుడు, గూడూరు మున్సిపల్ వైస్ చైర్మన్‌లు అస్లాం, లక్ష్మన్న, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఇమ్మానియేలు, నాయకులు తులసిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, చిన్న లక్ష్మన్న, సుంకన్న, భాస్కర్, మహేష్‌గౌడు, ఎల్. వెంకటేశ్వర్లు, రాజశేఖర్‌రెడ్డి, కృష్ణ, మధు, అయ్యస్వామి, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు మరువలేనివని జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు అన్నారు. శనివారం మండల కేంద్రం ఓర్వకల్లులో ఆయన వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే నన్నూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిప్పన్న, సర్పంచు బ్రహ్మయ్య, ఓర్వకల్లులో ఉపసర్పంచు నాగేశ్వరమ్మ, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, నాగలింగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కోడుమూరు రూరల్ : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి పేద ప్రజల గుండెల్లో ఆరోగ్య ప్రదాతగా నిలిచిపోయారని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్ తెలిపారు. వైఎస్ఆర్ 14వ వర్ధంతి సందర్భంగా మండలంలోని వర్కూరులో డాక్టర్ ఆదిమూలపు సతీష్ మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 300మందికి ఉచితంగా కంటి, షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలను నిర్వహించి అవసరం మేరకు మందులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈశ్వరరెడ్డి, ఎంపీటీసీ హనుమంతు వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జోనల్ ఇన్‌చార్జ్ డా.హరిక్రిష్ణ, ఉపసర్పంచ్ రంగన్న, నాయకులు రమణారెడ్డి, పాపిరెడ్డి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



వర్కూరులో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్

వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

కోడుమూరు రూరల్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ కొనియాడారు. పేద ప్రజలు, రైతుల అభ్యున్నతికై జలయజ్ఞం, ఆరోగ్యశ్రీ, రుణమాఫీ ఉచిత కరెంట్ వంటి సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. దివంతగ ముఖ్యమంత్రి వైఎస్సార్ 14వ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ స్థానిక వైసీపీ నేతలతో కలిసి కోడుమూరులో వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోడుమూరు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ భీమిరెడ్డి, సర్పంచు మధుసూదన్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అద్దుగల రాజశేఖరరెడ్డి, లాయర్ ప్రభాకర్, ప్రతాప్ రెడ్డి, బలరాం, ఏకాంబరం, డా.షాకీర్‌బాషా, జయన్న, పాపిరెడ్డి, అయ్యప్ప, రమణారెడ్డి పాల్గొన్నారు.

గూడూరు: పట్టణంలో శనివారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ 14వ వర్ధంతిని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, సచివాలయాల కన్వీనర్ ఎల్.వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జే.ఆబేలు తదితరులు ముందుగా పాత బస్టాండ్ లోని వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదనంతరం పేదలకు బట్టలు పంపిణీచేసి ఆసుపత్రిలో రోగులకు పండ్లు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పత్తి రంగడు, సత్యాలు, మద్దివిజయ్, కుమార్ పాల్గొన్నారు.



కోడుమూరు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డా.సుధాకర్

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో సర్పంచ్ పాండురంగన్న ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 14వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రజలకు వైఎస్సార్ చేసిన సేవలను ఈ సందర్భంగా ఎంపీపీ గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శులు బాయికాటి మద్దిలేటి, ముందరింటి వెంకటేష్, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సీబీ గోవిందరెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎస్ఎం బాష, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నకొండన్న, నాయకులు నాగరత్నం, రఘురెడ్డి, మండలంలోని పోలకల్, గుండ్రేవుల, కొండాపురం, బ్యాతోలి, బురాన్‌దొడ్డి తదితర గ్రామాలకు చెందిన వార్డు సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజల్లో గుండెల్లో చెరగని ముద్ర వేసిన వైఎస్సార్



కోడుమూరులో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కోడుమూరు: మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్.రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ, రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత కరెంట్, జలయజ్ఞం వంటి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేవారని కుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం స్వర్గీయ డా.వైఎస్.రాజశేఖర రెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ స్టేట్ కమిటీ సభ్యులు సంధ్యవిక్రం కుమార్ ఆధ్వర్యంలో కోడుమూరులోని బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. అంతకుముందు దివంగత డా.వైఎస్.రాజశేఖరరెడ్డి చిత్ర పటానికి జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్‌రెడ్డి, సంధ్యవిక్రంకుమార్, ఉపసర్పంచు మాదులు, మాజీ ఉపసర్పంచు ప్రవీణ్‌కుమార్‌తో కలిసి కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌నాయుడు, రవికుమార్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాంనాథ్‌రెడ్డి, మల్లారెడ్డి, రాఘవేంద్ర, లింగన్న, ఎంపీటీసీ సభ్యులు, వార్డుమెంబర్లు పాల్గొన్నారు.

అన్ని వార్డులు అభివృద్ధి చేస్తాం



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య

కల్లూరు: కర్నూలు నగరంలో అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 29వ వార్డుల్లో రూ. 50 లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మేయర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. కల్లూరు అర్బన్ రోజురోజుకు విస్తరిస్తుండటంతో ప్రాధాన్యతలను అనుసరించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, డీఈఈ గోపాల కృష్ణ, ఏఈ భాను ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- జిల్లా అధ్యక్షులు బి.వై.రామయ్య, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్

గూడూరు రూరల్: ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత పాలక మండలిపై ఉంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు మేయర్ బివై రామయ్య, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ పేర్కొన్నారు. కె.నాగలాపురంలో సుంకులమ్మ ఆలయ ట్రస్టు బోర్డు నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవానికి శనివారం వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన పాలక మండలి ఆలయ అభివృద్ధితోపాటు భక్తులకు అవసరమైన వసతులు, సౌకర్యాలను కల్పించాలన్నారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి రోజున ప్రమాణ స్వీకారం శుభపరిణామన్నారు. ఉమ్మడి ఏపీలో రైతులకు రుణమాఫీ, విద్యుత్ బకాయిల మాఫీ, ఉచిత విద్యుత్, ఉన్నత చదువుల కొరకు పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, 108, పేదలకు గృహాలు వంటి గొప్ప కార్యక్రమాలను వైఎస్సార్ చేయడంతో ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. తన తండ్రి అభివృద్ధి, సంక్షేమంలో రెండు అడుగులు వేస్తే తాను నాలుగు అడుగులు ముందుకు వేస్తానని చెప్పిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నాలుగున్నరేళ్ల పాలనలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించారన్నారు. ఏదో ఒక పథకం కింద ప్రతి కుటుంబం లబ్ధిపొందడం జరిగిందన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని వారు కోరారు. అనంతరం సుంకులమ్మ ఆలయ నూతన పాలక మండలి చైర్మన్‌గా ఉమామహేశ్వరమ్మ, వైస్ చైర్మన్‌గా లక్ష్మన్న, సభ్యులుగా బజారమ్మ, మాదవి, జయమ్మ, ఈరన్న, లక్ష్మీదేవి, చెన్నయ్యలతో ఆలయ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్త పాలక మండలి సభ్యులతో కలిసి బీవై రామయ్య, ఎమ్మెల్యే సుధాకర్ అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈఓ రాధాకృష్ణ, అమడగుంట్ల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీలు మౌలాలి, గిరిజోన్, ప్రసన్నకుమార్, వైస్ ఎంపీపీ రాజమ్మ, గూడూరు నగర పంచాయతీ వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, లక్ష్మన్న, నరసింహారెడ్డి, ఎల్లారెడ్డి, శీను, రంగస్వామి, లావణ్య, అజీమున్నిసా, లాయర్ ప్రభాకర్, ఎస్ఎం బాష, రాఘవరెడ్డి, చికెన్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్, చిత్రంలో కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఓర్వకల్లు: పేదల సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమని జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా అన్నారు. శనివారం మండలంలోని ఎన్. కొంతలపాడు, గుట్టపాడు గ్రామ సచివాలయాల పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు బీమా పథకం రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. కొంతలపాడు సర్పంచు మధుకేశన్న ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో లోటర్‌బాషా మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, గృహాలు, ఇతర సంక్షేమ పథకాలు అందజేయడం జరిగిందన్నారు. ఏ ప్రభుత్వంలో జరగని అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఈ ప్రభుత్వంలో జరగాయంటే అది కేవలం వైఎస్ జగన్‌కే సాధ్యమవుతుందన్నారు. ఈ పథకాలను జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీకాంతారెడ్డి, మద్దయ్య, సింగిల్ విండో డైరెక్టర్ మాధవస్వామి, సచివాలయ కన్వీనర్లు నాగార్జున రెడ్డి, సావిత్రి, గృహసారథులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లోటర్‌బాషా

స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు వేగవంతం చేయండి

కర్నూలు (టౌన్): నగరంలోని 19 వ వార్డు జొహరాపురం రోడ్డులో చేపడుతున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. శనివారం స్థానికంగా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. వివరాలను అసిస్టెంట్ ఇంజినీర్ జనార్ధన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రూ. 1 కోటితో చేపడుతున్న టెన్నిస్ సింథటిక్ కోర్టు, క్రికెట్ అకాడమీ నెట్స్, వాకింగ్ ట్రాక్‌తో పాటు చుట్టు కాంపౌండ్ పనులు ఆలస్యంగా జరుగుతున్నాయన్నారు. మూడు వారాల వ్యవధిలో ఈపనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు.

- నగరంలోని స్థానిక గాయత్రీ ఎస్టేట్ పార్కు, ఎండోమెంట్ కాలనీలోని పార్కుల అభివృద్ధి పనులను ఈ నెలాఖరులోపు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. శనివారం స్థానిక 25 వ వార్డు పరిధిలోని పార్కులో జరుగుతున్న పనులను కమిషనర్ పరిశీలించారు. కార్యక్రమంలో నగరపాలక ఇంజినీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షాకీర్ హుస్సేన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్ భాను ప్రతాప్, హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి... కేసు నమోదు

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో వ్యక్తి గాయపడగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పీరయ్య తెలిపారు. బీసీ కాలనీలో నివాసముండే జమ్మిచెట్టు అలియాస్ జమ్మన్న శుక్రవారం రాత్రి పొలం పనులను ముగించుకుని ఇంటికి వెళ్తున్నాడు. అదేకాలనీకు చెందిన మానికిందు సోమన్న, భార్య మంగమ్మ, కుమారుడు హరి ఇటు వెళ్లేందుకు దారిలేదని అడ్డుకున్నారు. మాకు ఇదేదారి అంటూ జమ్మన్న సమాధానం ఇచ్చాడు. దీంతో జమ్మన్న తలపై సోమన్న కర్రతో దాడిచేయగా రక్తగాయం అయ్యింది. అదేవిధంగా అడ్డువచ్చిన జమ్మన్న కుమారుడు పరుశరాముడుపై మంగమ్మ కారంపొడి చల్లి దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సోమన్న, మంగమ్మ, హరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శ్రీ కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోనా వేంకటేశ్వర స్వామివారికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భూదేవి, అలివేలి మంగమ్మ సమేత శ్రీ కోనా వేంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించారు. వివిధ గ్రామాల ప్రజలు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన చేశారు.

దేశ బలోపేతమే లక్ష్యం

కర్నూలు (న్యూటౌన్): భారతదేశం బలోపేతంగా ఉండాలన్నదే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని మాజీ రాజ్యసభ సభ్యులు, బీజేపీ నేత టీజీ వెంకటేష్ అన్నారు. శనివారం కర్నూలు మండలం గార్గేయపురంలో నా మట్టి.. నా దేశం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి మట్టిని సేకరించారు. అనంతరం వెంకాయపల్లె ఎల్లమ్మ దేవస్థానంలో ఎల్లమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రూ.5లక్షలతో నిర్మించిన టీజీవీ మినిరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా మట్టి నా దేశం అనే నినాదాన్ని భారతదేశంలో ప్రతి గ్రామంలో బీజేపీ ముందుకు తీసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, బీజేపీ కోడుమూరు ఇన్‌చార్జ్ మీసాల ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



ఇంటింటికీ వెళ్లి మట్టి సేకరిస్తున్న మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్

భూముల రీసర్వేకు సహకరించాలి

ఓర్వకల్లు: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సర్పంచు అయ్యస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సభలో రైతుల అభిప్రాయాలు, తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వ రీ సర్వే నిర్వహిస్తోందన్నారు. సమావేశంలో సర్వేయర్ జయరాముడు, వీఆర్‌ఓ, ఎంపీటీసీ సభ్యులు పుల్లయ్య రైతులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి

మినీ ట్రక్ బోల్తా

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామంలోని కేఎంసీ క్యాంప్ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం మినీట్రక్ బోల్తా పడింది. టైర్ పంక్చర్ కావడంతో జరిగిన ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని రహదారిపై వాహనాన్ని తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.